

కథా కౌముది

# అమ్మ కడుపు చల్లగా..

సత్యం మందపాటి

స్కూలు నించీ విస్మయని తీసుకుని ఇంటికి వచ్చేసరికీ సాయంత్రం ఐదున్నరయింది.

విస్మయ భుజాన స్కూల్ బాగ్ అలానే వుంచుకుని, ఫ్రిడ్జ్‌లోనించీ ఐస్‌క్రీం కప్ తీసుకుని, మేడ మీద తన గదికి వెళ్ళిపోయింది.

అప్పటికే సమీర బాగా అలిసిపోయిందేమో, కాసేపు అలా సోఫాలో వెనక్కి వాలి కూర్చుని కళ్ళు మూసుకుంది.

భాస్కర్ ఇంకాసేపట్లో వస్తాడు. అతనికి ఏం చెప్పాలి? ఎలా చెప్పాలి? మనసులో ధైర్యం కూడగొట్టుకుంటూ ఆలోచనలో పడింది.

ఆ రోజంతా అటు ఆఫీసులోనూ, ఇటు డాక్టర్ అపాయంట్‌మెంట్‌తోనూ బిజీగా గడిచిపోయింది.

డాక్టర్ మార్షా మెక్కాయ్‌తో తన మనసులోని మాట చెప్పింది. ఆవిడ చెప్పిందీ సబబుగానే వుంది. ఆలోచించిన కొద్దీ తను ధైర్యం పుంజుకుంటున్నది.

లేచి కిచన్‌లోకి వెళ్ళింది. రాత్రి వంట కోసం, ఫ్రిడ్జ్‌లో నించీ కూరగాయలు తీస్తుంటే గరాజ్ డోర్ తెరుచుకుంటున్న చప్పుడయింది. అంటే భాస్కర్ వచ్చాడన్నమాట.

'హాయ్... సమీరా... ఎలా వుంది ఇవాళ... ' అడిగాడు, చేతిలోని కంప్యూటర్ బాగ్‌ని పక్కన పెడుతూ.

సమీర నీరసంగా నవ్వి 'అంతా బాగానే వుంది. బాగా బిజీగా వుంది ఆఫీసులో.. ఇప్పుడే వచ్చాను' అంది, కూరలు తరగటం మొదలు పెడుతూ.

'నువ్వు మిగాతా పనులు చూడు... నేను తరిగేస్తాను... ' అంటూ సమీర చేతిలోని కత్తిని తీసుకున్నాడు భాస్కర్.

తర్వాత అతను అడిగే ప్రశ్న తెలుసు కనుక తనే జవాబు చెప్పింది సమీర.

'వస్తూ వస్తూ విస్మయని స్కూల్‌నించీ తీసుకు వచ్చాను... పైకి వెళ్ళింది' అంది.

'గుడ్! ముందు ఇది చెప్పు... ఉల్లిపాయలూ, మిరపకాయలూ... చిన్న చిన్న ముక్కలా... కొంచెం పెద్దవా... ' అడిగాడు.

అది కూడా ఎప్పుడూ అడిగే ప్రశ్నే కనుక, సిద్ధంగా వున్న సమాధానం చెప్పింది సమీర.

కత్తితో చకచకా వంకాయలు తరుగుతూ అడిగాడు భాస్కర్ - 'డాక్టర్ దగ్గరికి వెళ్ళావా?' అని.

'వెళ్ళాను. అంతా సవ్యంగానే వుందన్నది డాక్టర్ మెక్కాయ్. ఈసారి కూడా డెలివరీ మామూలుగానే అవుతుందనీ, సిజేరియన్ అవసరం రాదనీ, చెప్పిన ఎక్సర్‌సైజులు మాత్రం రోజూ తప్పకుండా చేయమనీ చెప్పింది' అంది సమీర రైస్ కుక్కర్ ఆన్ చేస్తూ.

'మరి... '

'ఇంకా మరి ఏమిటి... బేబీ కూడా ఆరోగ్యంగా వుందనీ... దేనికీ దిగులు పడద్దొని చెప్పింది... '

'బేబీ ఆరోగ్యంగా వుంది అన్నదా, వున్నాడు అన్నదా... ' అడిగాడు ఉల్లిపాయలు ఒలుస్తూ భాస్కర్.

'ఇంగ్లీషులో బేబీ ఈజ్ హెల్తీ అన్నది... '

'మరి... మనం అనుకున్నట్టు అబ్బాయో అమ్మాయో పరీక్ష చేయించుకోలేదా? ' అడిగాడు భాస్కర్.

'లేదు... అలా తెలుసుకోవటం నాకు ఇష్టం లేదు. సర్‌ప్రైజ్‌గా వుంటేనే బాగుంటుంది. '

ఈసారి కొంచెం కటువుగానే అన్నాడు భాస్కర్. 'ఏమిటి సర్‌ప్రైజ్? అప్పుడు విస్మయ పుట్టినప్పుడూ ఇలాగే చేశావు. అందుకే పేరు కూడా విస్మయ అని పెట్టావ్. ఇప్పుడు ఇంకో అమ్మాయి పుడితే ఆశ్చర్య అని పేరు పెడతావా... '

సమీర మౌనంగా వూరుకుంది.

ఈలోగా విస్మయ అక్కడికి రావటంతో భాస్కర్ 'హాయ్ స్వీటీ... హవీజ్ ఎవ్విరిథింగ్ ఇన్ స్కూల్ టుడే.. హోం వర్క్ అయిపోయిందా?' అని మాట మార్చాడు.

అయిందని తల వూపి, పియానో ముందు కూర్చుని సాధన మొదలుపెట్టింది విస్మయ.

●●●

భోజనాలు పూర్తయాక, సమీర చిన్నచిన్న పనులన్నీ పూర్తి చేసి, వాషర్‌లో నించీ బట్టలు తీసి డ్రైయ్యర్‌లో పడేసింది.

బల్ల మీద వున్న గొల్లపూడివారి 'అమ్మ కడుపు చల్లగా' పుస్తకం తీసుకుని బెడ్ రూంకి వచ్చింది.

భాస్కర్ మంచం మీద పడుకుని టివీలో ఏదో షో చూస్తున్నాడు.

నైటీ వేసుకుని, అతని పక్కనే పడుకుని పుస్తకం చదువుతున్నది.

టీవీ సౌండ్ తగ్గించి సమీర వేపు తిరిగాడు భాస్కర్. నెమ్మదిగా అన్నాడు.

'పోయిన నెల డాక్టర్ దగ్గరికి వెళ్ళినప్పుడు, ఏడో వారంలో బేబీ సెక్స్ తెలియటం కష్టం, వచ్చే నెల చూద్దాం అన్నదన్నావ్. ఇప్పుడేమో పదకొండో వారం దాటింది... మరెందుకు అడగలేదు... '

చదువుతున్న పుస్తకం పక్కన పెట్టింది సమీర.

'ఒకవేళ బేబీ మగో ఆడో తెలుసుకున్నామనుకో. అప్పుడు ఏమిటి దాని వల్ల ఉపయోగం' సూటిగా అడిగింది.

'ఏమిటా! మనం ఏనాడో అనుకున్నాం ఇద్దరు పిల్లలు కావాలని. ఇద్దరూ మగపిల్లలే అయితే బాగుంటుందనేది మా అమ్మ. మొదటి కాన్పప్పుడు కూడా మనం ముందుగా తెలుసుకోకపోవటం వల్లనే విస్మయ పుట్టింది. అప్పుడు హైదరాబాద్‌లో అబార్షన్‌కి అన్ని సౌకర్యాలూ వున్నాయి కూడా. అయినా నువ్వు మాట వినలేదు. ఇప్పుడూ ఆడపిల్ల పుడితే... '

ధైర్యం తెచ్చుకుంటూ అడిగింది సమీర, 'ఏం? ఆడపిల్ల పుడితే ఏం? విస్మయ ఎంత అందమైన పిల్ల. చదువులోనూ, పియానోలోనూ ఎంతో ముందు వున్నది. అందరూ ఇష్టపడే స్వభావం తనది... అలాటిదే ఇంకో అమ్మాయి పుడితే అంతకన్నా అదృష్టం వుంటుందా?... '

సమీరకి తెలుసు ముందు వెనకాడినా, తర్వాత భాస్కర్ విస్మయని ఎంత ముద్దుగా చూసుకుంటున్నాడో.

'చేతులు కాలాక ఆకులు పట్టుకుని ఏం లాభం. అందుకే విస్మయని ప్రేమిస్తున్నాను. కానీ ఈసారయినా అబ్బాయి పుడితే మా అమ్మ కోరిక తీరుతుంది. మా వంశంలోనూ ఇక వేరే మగ పిల్లలు లేరు... నాకూ పున్నామ నరకం తప్పుతుంది... ' తన మనసులోని మాట బయట పెట్టాడు భాస్కర్.

అతను సీరియస్‌గా మాట్లాడుతున్నా, ఆ మాటలకి నవ్వు వచ్చింది సమీరకి. అయినా బయటికి కనపడనీయలేదు.

'నాకు అలాటివాటి మీద నమ్మకం లేదు. ప్రాణికి ఒకే ఒక జన్మ అని నేను చదివిన పుస్తకాల్లో నిరూపించారు' అని అందామనుకున్నది కానీ అనలేదు.

ఒక్క క్షణం ఆగి నెమ్మదిగా అంది 'మనిద్దరి కారణాలు వేరయినా, నాకు కూడా ఈసారి అబ్బాయి పుడితేనే బాగుంటుందని వుంది. ఒకమ్మాయి. ఒకబ్బాయి. మంచి కాంబినేషన్. అంతే కాకుండా మీరు వాడిని బేస్‌బాల్ ఆటలకీ, సాకర్ ఆటలకీ, మన పక్కింటి కెవిన్‌లాగా తీసుకువెడుతుంటే నాకు చూడాలని వుంది'

భాస్కర్ చటుక్కున తల ఎత్తి, సమీరని మెరిసే కళ్ళతో చూశాడు. 'మరింకేం' అనే అర్థం వుంది ఆ చూపుల్లో.

'మగపిల్లాడికి జన్మనివ్వాలా, ఆడపిల్లకి జన్మనివ్వాలా అనేది మనిద్దరి కోరికలతో జరగదు. మనిద్దరి బయాలజీ వల్ల జరుగుతుంది. అందుకుని ఎవరయినా సరే సంతోషంగా తీసుకోవటం మంచిది' అంది సమీర.

'మరి ఈసారీ అమ్మాయే పుడితే ఎలా?'

'అబ్బాయి పుట్టేదాకా పిల్లల్ని కనటమే... మూడోసారో, ఏడోసారో అయినా అబ్బాయి పుట్టడా.? ' అంది సమీర. ఎంత సౌమ్యంగా అందామనుకున్నా కొంచెం వెటకారం తొంగిచూస్తూనే వుంది.

భాస్కర్ సమీరని అదో రకంగా చూశాడు.

'ఈసారి అమ్మాయి పుడితే మా అమ్మ వూరుకోదు. ఇప్పటికే ఎన్నోసార్లు ఇండియానించీ ఫోన్ చేసి అబ్బాయో అమ్మాయో కనుక్కున్నారా అని అడుగుతున్నది'

'నేను చెప్పిందే నువ్వు అత్తయ్యగారికి చెప్పు' అంది సమీర.

'ఈ విషయంలో మా అమ్మ అభిప్రాయమే నాది కూడాను... '

'ఏమిటా అభిప్రాయం... ఒకవేళ అమ్మాయి పుడితే... '

'అలా పుట్టటం నాకిష్టం లేదు. అందుకే నీకు ఇంతగా చెబుతున్నది బేబీ సెక్స్ కనుక్కోమని' సూటిగా అన్నాడు.

గుండెల్లో మంటలు పుడుతుంటే గట్టిగానే అడిగింది సమీర.

'కనుక్కున్నామనుకో... అమ్మాయి అని చెబుతుంది డాక్టర్... అప్పుడేం చేస్తాం... '

'ఇండియాలో ఎంతోమంది ఏం చేస్తున్నారో మనమూ అదే చేస్తాం. అబార్షన్ చేయించుకుందాం' అన్నాడు భాస్కర్.

'చేయించుకుందాం కాదు. నువ్వు కాదు చేయించుకునేది. నేను. నాకిష్టంలేదు. అంతేకాదు ఇక్కడ అమెరికాలో, ఇండియా కన్నా కూడా ఈ విషయంలో ఎన్నో లీగల్ గొడవలున్నాయి. కడుపుతో వున్నాక పన్నెండు, పదమూడు వారాల దాకా నిర్ధారణగా బేబీ సెక్స్ కనుక్కోవటం కష్టం. తీరా సెక్స్ కనుక్కునేటప్పటికి పిండం దశనించీ ఎదిగి కడుపులో ఒక పాప వుంటుంది. అంటే అది అబార్షన్ అవదు. శిశు హత్య అవుతుంది. నేను దానికి ఒప్పుకోను. అంతే కాదు. నాకు కూతురైనా, కొడుకైనా ఒకటే... మన పిల్లలు మన పిల్లలే.. ఇక్కడ ఆడ మగ అన్న ప్రసక్తి లేదు' ధృడంగా అంది సమీర.

'ఇదేమీ కొత్త కాదు.. అనాదిగా జరుగుతున్నదే! ఇక్కడ చేయించుకోవటం మంచిది కాదనిపిస్తే ఇండియాలోనే కాన్పు చేయిస్తే సరి... '

'భాస్కర్! ఇక్కడా అక్కడా అని కాదు. అసలా శిశు హత్య చేయించుకోవటం నాకిష్టంలేదంతే. ఈ పున్నామ నరకాల కథలూ, శిశు హత్యలూ ఏనాటినించో జరుగుతూనే వున్నాయి. ఈ ఐటీ యుగంలో అవి తగ్గుతాయేమో, ఇది ఈనాటి కథ కాదు అనుకోటానికి వీలులేని పరిస్థితిలో వుంది మన సంస్కృతి. ఈనాటికీ అక్కడ భారతదేశంలోనూ జరుగుతున్నాయి, ఇక్కడ అమెరికా భారతీయుల్లోనూ

గుప్తంగా జరుగుతూనే వున్నాయి. ఇప్పుడు నాదాకా వచ్చింది కనుక ఆ బాధ నాకు తెలుస్తున్నది!' కసిగా అని, అక్కడనించీ లేచి కిచన్‌లోకి వెళ్ళింది సమీర.

ఒక పెద్ద గ్లాసుతో చల్లటి మంచి నీళ్ళు తాగి, సోఫాలో పడుకుని కళ్ళు మూసుకుంది.

●●●

తర్వాత నెలరోజుల పైన భాస్కర్ సమీరతో అంతగా మాట్లాడలేదు. ముక్తసరిగా అంటీ అంటనట్టు వుంటున్నాడు.

నాలుగైదుసార్లు ఇండియాలో తల్లితో మాట్లాడేటప్పుడు కూడా సమీరకు వినపడాలనే పెద్దగా మాట్లాడుతున్నాడు.

ముఖమాటం లేకుండా తల్లితో చెప్పాడు - సమీర తను చెప్పినట్టు వినటం లేదనీ, తను అంతకన్నా ఏమీ చేయలేకపోతున్నాననీ. ఆవిడ ఏం చెప్పిందో కానీ... అది మాత్రం నేను చేయలేనని అంటున్నాడు. ఆ మాటలు చెప్పేటప్పుడు గొంతు తగ్గించి, నెమ్మదిగా రహస్యం చెప్పినట్టు చెబుతున్నాడు. మధ్యమధ్యలో అమెరికాలో న్యాయశాస్త్రం గురించి కూడా చెబుతున్నాడు.

ముందు కొంచెం చెవులు రిక్కించి విన్నా, తర్వాత పట్టించుకోవటం మానేసింది సమీర.

భార్యాభర్తల మధ్య ఏం జరిగినా, విస్మయకి మాత్రం ఏమీ తెలియకుండా ఇద్దరూ జాగ్రత్త పడుతూనే వున్నారు.

బహుశా అది అమెరికన్ సంస్కృతి నేర్పిన పాఠమేమో!

●●●

క్రమం తప్పకుండా డాక్టర్ దగ్గర పరీక్షలు చేయించుకుంటున్నది సమీర. భాస్కర్ అడిగినా అడగకపోయినా, ఆ వివరాలన్నీ అతనికి చెబుతూనే వుంది.

అతనిలోనూ కోపం తగ్గినట్టుగా కనిపిస్తోంది. సమీరతో మామూలుగానే మాట్లాడుతున్నాడు. ఆరోగ్యం గురించి అడుగుతున్నాడే కానీ, విషయపరంగా ఆడా మగా అన్నదానికి మాత్రం దూరంగానే వుంటున్నాడు. కానీ అతని మనోభావాలలో ఏమీ మార్పు రాలేదని తెలుస్తూనేవుంది.

ఎనిమిదో నెలలో సమీర అతన్ని అడిగింది, కాన్పుకి సహాయంగా వుంటుంది అత్తగారిని రమ్మందామా అని. ఆవిడ రానని మొండిగా చెప్పేసింది భాస్కర్‌తో. తన మాటని విననందుకు ఆవిడ ఇంకా మండిపడుతూనే వుంది.

'మా అమ్మ బ్రతికుంటే తప్పకుండా వచ్చి వుండేది... ' అనుకుని బాధపడింది సమీర.

చివరికి ఎవరి సహాయమూ లేకుండానే ప్రసవం చేసుకోవటానికి నిర్ణయించుకుంది సమీర.

●●●

ప్రసవానికి ఇంకో వారం రోజులు సమయం వుందన్నప్పుడు, భాస్కర్‌ని అడిగింది సమీర.

'అమెరికాలో పిల్లలు పుట్టేటప్పుడు భర్త భార్య పక్కనే వుండటం, భార్యకు సహాయపడటం మామూలుగా జరుగుతుంది. విస్మయ ఇండియాలో పుట్టింది. అక్కడ అలాటి ఆచారం లేదు. ఈసారి నువ్వు పక్కనే వుండి, నా చేయి పట్టుకుని ధైర్యం చెబుతావా?' అని అడిగింది.

'అమ్మో! నేను రక్తం చూడలేను. నాకు భయం' అన్నాడు భాస్కర్.

సమీర చిన్నగా నవ్వి 'పిల్లని... అదేలే... పిల్లాడిని కనేది నేను. నువ్వు కాదు. నీకెందుకు భయం. కళ్ళు గట్టిగా మూసుకుని, నా చేయి గట్టిగా పట్టుకుని మంచం మీద కూర్చో' అంది.

కాసేపు వాదోపవాదాలయాక చివరికి ప్రసవ సమయమప్పుడు అక్కడే వుండటానికి ఒప్పుకున్నాడు భాస్కర్.

●●●

ఆరోజు సాయంత్రం నొప్పులు వస్తుంటే, ముందు అనుకున్నట్టుగా వాళ్ళింటికి దగ్గరలోనే వున్న స్నేహితురాలు ప్రమీలకి ఫోన్ చేసింది సమీర.

సమీర డాక్టర్ మార్షా మెక్కాయ్‌కి కూడా ఫోన్ చేసి హాస్పిటల్‌కి వెడుతున్నామని చెప్పింది. ఆవిడ అక్కడ ఎడ్మిట్ అవమనీ, కాసేపట్లో చూస్తాననీ చెప్పింది.

విస్మయ తల్లి బుగ్గ మీద ఒక ముద్దు పెట్టి, 'బ్రింగ్ మీ హోం ఎ స్వీట్ లిటిల్ సిస్టర్' అంది.

పక్కనే వున్న భాస్కర్‌ని నవ్వుతూ చూసింది సమీర.

ప్రమీల వచ్చి విస్మయని తన ఇంటికి తీసుకువెళ్ళింది.

డాక్టర్ మెక్కాయ్ పరీక్ష చేసి, ఇంకొక గంటలో ప్రసవమవుతుందని చెప్పి, అప్పటికప్పుడు డెలివరీ గదికి మార్చింది.

నర్స్ వచ్చి బ్లడ్ ప్రెషర్ తీసుకున్నది. ఏవో మాత్రలు ఇచ్చింది. ఒక ఇంజక్షన్ కూడా చేసింది.

భాస్కర్ కూడా హాస్పిటల్ డ్రస్ వేసుకుని సమీర తల దగ్గర కూర్చున్నాడు.

డాక్టర్ మెక్కాయ్ 'కంట్రాక్షన్స్ వాటంతటవే ఎక్కువవుతాయి. అలా కాకపోతే ఇండ్యూస్ చేద్దాం' అంది.

డాక్టర్ అన్నట్టుగానే కాసేపట్లో నొప్పులు రావటం ఎక్కువయింది.

సమీరని రెండు కాళ్ళూ ఎడం చేసి పైకి మడిచి పెట్టి అలా పడుకోమన్నారు. డాక్టర్ ఆమె కాళ్ళకి మధ్యగా నుంచుని చేతికి వున్న గ్లవ్స్ సరిచేసుకుంటున్నది. పక్కనే నర్స్ సహాయంగా వుంది.

సమీర చేతిని తన ఎడం చేతితో పట్టుకుని, కుడి చేత్తో ఆమె నుదుటికి పట్టిన చెమట తుడుస్తున్నాడు భాస్కర్.

డాక్టర్ మెక్కాయ్ 'బేబీ రాబోతున్నది. మీరు ఇలా వచ్చి చూస్తారా?' అని అడిగింది భాస్కర్‌ని.

అతని జవాబు కోసం ఎదురు చూడకుండా సమీరతో అంటున్నది 'కొంచెం పుష్ చేయి! బేబీ సులువుగా బయటికి వస్తుంది. ఆపరేషన్ ఏమీ అఖ్ఖర్లేదు.... ఇంకొక్కసారి.. పుష్ చేయి.. అదిగో అలా... '

సమీర బాధతో అరుస్తున్నది. ఎయిర్ కండిషన్ నడుస్తున్నా, పైన ఫాన్ తిరుగుతున్నా ఆమెకి విపరీతంగా చెమటలు పోస్తున్నాయి. కట్టుకున్న హాస్పిటల్ గౌన్ అప్పటికే తడిసిపోయింది.

భాస్కర్ ఆమె మీదకు దగ్గరగా వంగి ఆమె చేయి పట్టుకున్నాడు.

సమీరకి ప్రసవ వేదన ఎక్కువయింది. బాధతో ఏడుస్తున్నది.

'బేబీ వస్తున్నది. ఇంకొక్కసారి. పుష్ చేయి. మరోసారి... ' అంటున్నది డాక్టర్ మెక్కాయ్, చేతులతో బేబీ పొసిషన్ తడుముతూ.

'కొంచెం తట్టుకో సమీరా... అయిపోతున్నది... ' అంటున్నాడు భాస్కర్.

'తల బయటికి వచ్చేసింది... ఇంకొక్కసారి పుష్ చేయి... ఇంకొక్కసారి... ' అంటున్నది డాక్టర్ మెక్కాయ్.

అక్కడ సృష్టి జరుగుతున్నది. ఒక మనిషి ఇంకొక మనిషికి జన్మనిస్తున్నది.

ఏడుపులోనించీ ఆనందం వస్తున్నది. కష్టంలోనించీ సుఖం వస్తున్నది.

ఒక పసిపాప పేగులు తెంపుకుని తల్లి గర్భంలో నించీ బయట ప్రపంచంలోకి... ప్రాపంచిక కష్టసుఖాల్లోకి అడుగు పెడుతున్నది.

ఒక స్త్రీ మరోసారి మాతృమూర్తి అవుతున్న శుభ సమయం.

అది మొదటిసారి అయినా, రెండోసారి అయినా... అదే.. అంతే ప్రసవ వేదన.

ఒక్కసారి పెద్దగా అరిచింది సమీర.

అదే సమయంలో ఇంకొక పసికందు ఆక్రందన.

రక్తంతో ముద్దగావున్న పసికందుని బయటకు తీసింది డాక్టర్ మెక్కాయ్.

సమీర అరుపులని వింటూ, రక్తంలో తడిసిన పసికందుని చూస్తున్న భాస్కర్‌కి చెమటలు పట్టాయి. కళ్ళు తిరుగుతున్నాయి.

తర్వాత ఏమయిందో అతనికి తెలియలేదు. మంచం మీదే సమీర మీదకి ఒరిగిపోయాడు.

●●●

భాస్కర్ కళ్ళు తెరిచేసరికి అతని నాడి చూస్తున్న నర్స్ కనపడింది.

'మీ పేరు ఏమిటో తెలుసా?' అని అడిగింది. చెప్పాడు.

'మీరు ఎక్కడ వున్నారో తెలుసా?' అని అడిగింది. చెప్పాడు.

'గుడ్.. మీరు డెలివరీ గదిలో కళ్ళు తిరిగి పడిపోయారు. నెమ్మదిగా లేవండి. లోపలికి వెడదాం' అని, అతను ముందు నడుస్తుంటే వెనకనే వచ్చింది నర్స్.

లోపల సమీర నీరసంగా పడుకుని వుంది. అర్ధనగ్నంగా వున్న ఆమె ఛాతీ మీద పసికందు పడుకుని వుంది.

'తల్లి కడుపులోనించీ బయటకు రాగానే, పసికందుని తల్లి శరీరానికి హత్తుకునేటట్టు పడుకోబెడతాం.. ఆ స్పర్శ అలవాటయిన స్పర్శ కనుక, పసికందుకి కొత్తగా వుండదు' అంటున్నది నర్స్.

ఆ మాటలకి కళ్ళు తెరిచింది సమీర. అతన్ని చూసి చిన్నగా నవ్వింది.

'ఎలావుంది సమీరా... నీరసంగా వుందా?' భాస్కర్ అడిగాడు ప్రేమగా.

'బాగానే వుంది... ' అంది సమీర. నూతిలోనించీ వచ్చినట్టుంది ఆమె గొంతు.

'నీకెలా వుంది?' అడిగింది.

అతను సిగ్గు పడుతూ చిన్నగా నవ్వాడు.

ఆమె తల మీద చేత్తో నిమురుతూ, నుదుటి మీదా, బుగ్గల మీదా, పెదిమల మీదా ముద్దు పెట్టుకున్నాడు.

చేత్తో పసికందుని చూపించింది సమీర.

'అబ్బాయో అమ్మాయో మీకు తెలిసిందా?' అంటున్న సమీర నోటి మీద, తన చూపుడు వేలు వుంచి ఆమెని మాట్లాడనీయలేదు.

ఆమె వక్షస్థలం మీద నిద్రపోతున్న పసికందు తల మీద సుతారంగా నిమిరి, ఆ లేలేత వీపు మీద ముద్దుపెట్టుకున్నాడు.

●●●

(గొల్లపూడి మారుతీరావుగారి సంపాదకత్వంలో వస్తున్న సురభి మాసపత్రిక, నవంబర్ 2010 సంచికలో ప్రచురింపబడింది.

మరింతమంది పాఠకులకు చేర్చాలనే ఉద్దేశంతో పునఃప్రచురణ)

Click here to share your comments on this story